27052024-DIS-08_Layout 1 5/27/2024 3:22 AM Page 1



# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

## ఉదయాన్నే మేల్కొంటుంది



గతించిన కాలం ఎంతగా
నెమరేసుకున్న
తీరని జ్ఞాపకాలు
కాలం పాపం పగబట్టిందో ఏమో
కుక్కలు చింపిన ఇస్తరైంది

భవిష్యత్తు
కలలకు రంగులద్ది
ఇంద్రధనస్సు ఆకాశం నుంచి
ఇలకు దిగినట్టుగా
ఆశల పల్లకిలో ఊరేగుతుంది

నిద్ర దుప్పటి కప్పుకున్న రాత్రి
కలలు స్వప్నాలు విరబూసింది
జన జీవన స్రవంతిలో ఉన్న పగలు
ఏకాంతంగా కారడవిలోకి
దూరిపోయింది

మనుషులను పోగేసే ఐదు వేళ్ల పిడికిలి
మందలో తప్పిన
గొర్రె పిల్లలా ఒకటే అల్లరి
యుద్ధంలో గెలిచిన అభిమన్యుడు
పద్మవ్యూహంలో చిక్కుకున్నాడు
మాంసం లేకుండా నిద్ర పోని పెద్ద పులి
గడ్డి పోసలను కొరక్క తింటుంది

వేల అర చేతుల చప్పట్ల మోతలు
రెక్కలొచ్చిన పక్షిలా ఎగిరిపోయినవి
కన్ను రెప్పలను ముద్దాడి
అలుగెల్లిపోయిన దుఃఖం

గుణపాఠం నేర్చుకున్న బతుకు
దారిమళ్లని పారుతున్న ఆశ
ఎప్పటిలాగే అస్తమించిన పొద్దు
ఉదయాన్నే మేల్కొంటుంది



ఎదిరెపల్లి కాశన్న

> గోలకొండ కవుల సంచికను వెలువరించి.. తెలంగాణలో కవులే లేరనే నింద వ్యాఖ్యలకు దీటైన సమాధానమిచ్చిన ధీశాలి, తెలంగాణ వైతాళికుడిగా పేరుగాంచిన మహోన్నత వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బహుముఖీన ప్రతిభ చాటిన ప్రజ్ఞాశాలి ఆయన. సమాజ హితం కోసం జీవితాంతం కృషిచేసిన ఉద్యమశీలి సురవరం.

# అతడు లేని తెలంగాణ, అలంకరణ లేని జాణ



'సురవరం ప్రతాపరెడ్డి పేరు వినగానే ఒక మహోన్నత మూర్తి మన కండ్ల ముందు సాక్షాత్కరిస్తారు. బహుముఖ ప్రతిభకు ఆయన నిలువెత్తు ఉదాహరణ. సురవరం మేధాసంపన్నుడు. వాఙ్మయ రంగంలో ఆయన ప్రతిభ, ప్రజ్ఞ కనరాని విభాగమే లేదు. ఆయన గొప్ప విమర్శకులు మాత్రమే కాదు, కవి, పండితుడు, పత్రికా రచయిత, రాజకీయవేత్త కూడా. వీటన్నింటిని మించి మంచి పరిశోధకుడు, హృదయం గల దేశాభిమాని. సకల కళా సాహిత్య సేవా దురంధరుడు' అని ప్రముఖ చారిత్రక పరిశోధకుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ రాయడాన్ని బట్టే ప్రతాపరెడ్డి ఎంతటి మహానుభావుడో అర్థం చేసుకోవచ్చు.

నేటి జోగులాంబ జిల్లాలోని గద్వాల సంస్థానానికి రాజధానిగా ఉన్న బోరవెల్లి గ్రామంలో 28 మే 1896లో సురవరం ప్రతాపరెడ్డి జన్మించారు. ఆయన అసలు పేరు పాపిరెడ్డి. చిన్నప్పటి నుంచే గొప్ప ధారణాశక్తి గలవాడు. అయితే చండశాసనుడైన తన గురువు రఘురామయ్య కఠినత్వంతో చదువుపై ఆయనకు విముఖత పెరిగింది. దాంతో బడి ఎగ్గొట్టి గోటిలాడుకోవడం మొదలుపెట్టారు. ఈ విషయం ఆయన పిన తండ్రి రామకృష్ణారెడ్డికి తెలిసి కఠినమైన దినచర్యను పాటింపజేశారు. దీంతో సురవరం జీవితం మలుపు తిరిగింది. ప్రతాపరెడ్డి ఐదో తరగతి చదివేటప్పుడే 'తెలుగులో కవిని కావలెను. శాశ్వత కీర్తి సంపాదించవలెను. లేకున్నా నా జీవితం వ్యర్థం' అని అనుకున్నాడట. అనుకుంటే సరిపోదు స్వయంకృషి, సాధన, సంకల్పం అవసరమని ఆయన గ్రహించారు. ఆలోచన కలిగిందే తడవుగా చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు, కందుకూరి వీరేశలింగం పంతులు రచనలను సంపాదించుకున్నారు. చామకూర వేంకటకవి విజయ విలాసం, ఇతర ప్రబంధాలను అధ్యయనం చేశారు. ఇలా చదవడం ఒక అలవాటుగా కాకుండా, వ్యసనంగా మారిపోయింది ప్రతాపరెడ్డికి. ఆయన కొన్న పుస్తకాలకు, చదివే పుస్తకాలకు లెక్కే లేదు. కొత్త పుస్తకం వచ్చిందంటే చాలు కొనాల్సిందే, చదువాల్సిందే. ఆషామాషీగా చదువకుండా పరిశీలనాత్మకంగా, పరిశోధనాత్మకంగా, విమర్శనాత్మకంగా చదివేవారు. చదివిన ప్రతి పుస్తకంపై విమర్శ రాసి పెట్టుకునేవారు. ఆ లక్షణమే భవిష్యత్తులో అతన్ని మహా పరిశోధకుడిగా నిలిపింది. ఆ చదువే అతనికి తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ, కన్నడ భాషల్లో పట్టు సాధించేటట్టు చేసింది. సంస్కృతం నేర్చుకోవడానికి వేదం వెంకటరాయ శాస్త్రి విధించిన షరతు మేరకు మాంసాహారాన్ని మానివేశారాయన. ఈ విధంగా సురవరం జీవితానికి మలుపును, గెలుపును చదువు తెచ్చిపెట్టింది. చిన్నప్పుడు పాఠశాలలో పట్టుమని పది నిమిషాలు కూడా ప్రసంగించని ప్రతాపరెడ్డి తర్వాతి కాలంలో గంటల తరబడి మాట్లాడగలిగే స్థాయికి ఎదిగారు. ఒక విధంగా చెప్పాలంటే పట్టుదల ముందు ఎటువంటి ప్రతిబంధకాలు అడ్డుకావని నిరూపించారు ప్రతాపరెడ్డి.

> కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, జీవిత చరిత్ర వంటి అనేక సాహిత్య ప్రక్రియలను సమర్థంగా నిర్వహించిన ప్రతాపరెడ్డి జానపద సాహిత్య సేకరణ చేయడమే కాకుండా, ఆంధ్రుల సాంఘిక చరిత్ర వంటి పరిశోధనాత్మక గ్రంథాలను రాశారు. ఇది చరిత్ర రచనకు ఒజ్జ బంతి అయింది. అందుకే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందిన గ్రంథంగా చరిత్ర సృష్టించింది.

'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అనుకునేవాడు స్వార్థజీవి. పదిమంది మేలు కోసం పాటుపడేవాడు సార్థక జీవి. తన డబ్బును, అక్షర సంపదను తెలంగాణ శ్రేయస్సు కోసం ధారపోసిన మహాత్యాగి సురవరం. ఆనాటి నిజాం ఉక్కు పాదాల కింద ఉలుకు పలుకు లేని తెలంగాణలో నవ చైతన్యాన్ని నింపడానికి ఆయన నడుం బిగించారు. 'మూగపడిన తెలంగాణ మూలిగిన తొలినాటి ధ్వని' అని ప్రతాపరెడ్డిని డాక్టర్ దాశరథి కీర్తించారు. ప్రజా చైతన్య మహోద్యంలో దొరికిన ఏ అవకాశాన్ని సురవరం జారవిడుచుకోలేదు. ఏకకాలంలో విభిన్న రంగాల్లో కృషి చేశారు. రంగాలు ఏవైనా ఆయన అంతరంగం మాత్రం తెలంగాణ మహాభ్యుదయమే. కొన్ని రోజుల పాటు హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్ నిర్వహణ ద్వారా సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు కూడా. విద్యార్థుల దినచర్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. క్రమశిక్షణకు పెద్దపీట వేశారు. విద్యార్థి బాగుపడితే సమాజం బాగుపడుతుందనేది ఆయన ఆలోచన. 'మొక్కై వంగనిది మానై వంగునా?' అన్నది ఆయన అంతర్గత ఆలోచన. అందుకే విద్యార్థుల ఆలోచనల్లో, అధ్యయనాల్లో మార్పు కోసం శ్రీకారం చుట్టారు.

మద్రాసులో చదువుకునే రోజుల్లోనే జాతీయోద్యమం కారణంగా ప్రభావితుడైన ప్రతాపరెడ్డికి ఆనాడే పత్రిక స్థాపించాలన్న ఆలోచన కలిగింది. 'దేశ బంధు' అనే పేరు కూడా అనుకున్నారు. కానీ, ఆనాటి నిజాం ప్రభుత్వం అనుమతిచ్చే పరిస్థితి కనిపించలేదు. అందుకే 'గోలకొండ' అనే పేరు ఖరారు చేశారు. 1926, మే 10న గోలకొండ పత్రిక పురుడు పోసుకుంది. నాటి తెలుగు పత్రికా రంగంలో సంచలనాలకు తెరలేపింది.

ప్రతాపరెడ్డి పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది గోలకొండ పత్రిక. అది ప్రతాపరెడ్డి అక్షరాల కోట. ఎందరో రచయితలకు ప్రోత్సాహమిస్తూ నిష్పక్షపాతంగా 23 ఏండ్ల పాటు పత్రికను నడిపారు. నిజాంకు వ్యతిరేకంగా వార్త రాసిన షోయబుల్లాఖాన్‌ను నడివీధిలో నరికి చంపిన క్రూరమైన కాలమది. అటువంటి పరిస్థితుల్లో కూడా నిజం దుర్మార్గాలను నిరసిస్తూ అనేక సంపాదకీయాలు, వ్యాసాలు రాసిన సాహసి ప్రతాపరెడ్డి. 'తెలంగాణలో కవులే లేరు' అన్న నిందకు నిరసనగా ఎంతో శ్రమకోర్చి 'గోలకొండ కవుల సంచిక'ను 1935లో ప్రకటించారు. అందులో 183 మంది పూర్వ కవులు, 354 మంది ఆధునిక కవుల రచనలు, పరిచయాలున్నాయి. ఎలాంటి సాంకేతిక, రవాణా వ్యవస్థలు లేని నాటి రోజుల్లో కవుల, రచయితల సమాచారం సేకరించడం అంత సులువైన విషయం కాదు. మొక్కవోని సంకల్ప శక్తికి, కార్యదక్షతకు మారుపేరుగా వెలువడిన గోలకొండ కవుల సంచిక తెలంగాణ కవిత జయకేతనమని చెప్పవచ్చు. ఇంతటి ఘనకార్యం సాధించిన ప్రతాపరెడ్డి తన సొంత కవితలను సంకలనంగా వేయలేకపోయారు. తన గురించి కాదు, తన సమాజం గురించి ఆలోచించేవాడు ఉత్తముడవుతాడనేది ఆర్యోక్తి. ఆ కోవకు చెందినవారే మన సురవరం ప్రతాపరెడ్డి. పరాయి భాషా దౌర్జన్య ప్రభంజనానికి అల్లాడుతున్న తెలుగు దీపాన్ని ఆరిపోకుండా కృషిచేస్తూ అనేక సభలు, సమావేశాలతో.. 'అతడు లేని తెలంగాణ, అలంకరణ లేని జాణ' అన్న దాశరథి మాటలను నిజం చేశారు సురవరం.

కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, జీవిత చరిత్ర వంటి అనేక సాహిత్య ప్రక్రియలను సమర్థంగా నిర్వహించిన ప్రతాపరెడ్డి జానపద సాహిత్య సేకరణ చేయడమే కాకుండా, ఆంధ్రుల సాంఘిక చరిత్ర వంటి పరిశోధనాత్మక గ్రంథాలను రాశారు. ఇది చరిత్ర రచనకు ఒజ్జ బంతి అయింది. అందుకే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందిన గ్రంథంగా చరిత్ర సృష్టించింది. 'హిందువుల పండుగలు అనే గ్రంథానికి విపులంగా పీఠిక రాయడానికి నా శక్తి సరిపోదు' అని నాటి భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారంటే ఆ గ్రంథం విశిష్టతను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఇలా వివిధ భాషలపై పట్టు సాధించిన సురవరం ప్రతాపరెడ్డికి తెలుగంటే ఎంతో ప్రీతి. తెలుగును చిన్నచూపు చూసే వాళ్లను చూస్తే ఆయనకు అరికాలి మంట నెత్తికెక్కుతుంది. నిఘంటువులకెక్కని పదాలు ఎన్నింటికో అర్థాలను కూడా రాసి పెట్టారు సురవరం. తెలుగు లిపి సంస్కరణ జరగాలని కోరుకున్నారాయన. 28 అక్షరాలతోని వర్ణమాలను రూపొందించి పరిశోధన పటిమను ప్రదర్శించారు. ఆయన కలానికి రెండు వైపులా పదునే. గ్రాంథికం రాయగలరు, వ్యవహారికం వాడగలరు. గద్య రచనల్లో వ్యవహారిక భాషకు పెద్దపీట వేశారు. నిరాడంబరం, నిర్భీతి, నిజాయితీ, నిస్వార్థం ప్రతాపరెడ్డి జీవ లక్షణాలు. వేషభాషల్లో పరమత ప్రభావం ప్రచండంగా ఉన్న కాలంలో కూడా అచ్చమైన తెలుగువాడిగా జీవించగలిగారు ఆయన. ఆయనది నిండైన తెలుగు వేషం. అక్షరాలలోనే కాదు, అంకెల్లో కూడా తెలుగును వాడేవారు. ఆయన ఎవరినీ స్తుతించరు, ఆయనను ఎవరైనా స్తుతిస్తే భరించరు. అది ఆయన లక్షణం. మంచి ఎక్కడున్నా గ్రహించే మనస్తత్వం ఆయనది. ఇట్లా ఎందరికో ప్రేరకుడు, ఎన్నో రచనలు రావడానికి కారకుడయ్యారు. కులమతాల పట్టింపులు లేని సంస్కరణ శీలి. జోగిపేటలో జరిగిన మొట్టమొదటి ఆంధ్ర మహాసభలో భాగ్యరెడ్డి వర్మకు సభలో పాల్గొనే అవకాశం కల్పించిన మహనీయుడు ప్రతాపరెడ్డి. 1952లో వనపర్తి శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజల మనిషి అని నిరూపించుకున్నారు. తెలంగాణ సమాజాన్ని అన్ని కోణాల్లో ప్రభావితం చేసిన ప్రతాపరెడ్డి జీవనం నిజంగా పావనం. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయం.



కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
94415 61655

(మే 28న సురవరం ప్రతాపరెడ్డి జయంతి)

# ఆవేదనే ఓ నివేదన!

**'ఈ రక్త ప్రవాహం కావాలి.**
**కానీ అందులో కొందరు పడవలు వేసుకుని**
**ప్రయాణం చేస్తున్నారు.**
**కీర్తి శిఖరాలకు.**
**వాళ్ల లక్ష్యం కీర్తి శిఖరాలే గాని ఈ రక్తం ఎవరిదో, ఎవరి కోసం కారిందో వారి క్షేమం కాదు.**
**వాళ్లు తమ రక్తం ఒక్క బొట్టు కూడా కార్చరు.**
**పరాయివాళ్ళ రక్తం పారితే పాటలు రాస్తారు..**
**నేను చచ్చిపోవడం మంచిదే అయ్యింది.**
**చచ్చిపోతూ ఈ నీచుల తమాషా**
**చూస్తూ ఉండవచ్చు.**
**నాకేం కావాలి?**
**నా పాటల్ని పూలు పక్షులు గానం చేస్తాయి,**
**గాలులు, ఆకాశాలు దూర తీరాలకు మోసుకుపోతాయి.'**

'ఆధునిక మహా భారతం'లోని మయూర పర్వంలో తన ఆవేదన, ఆవేశం అంటూ 'నీచుల తమాషా' గురించి పై విధంగా రచించారు శేషేంద్ర శర్మ. పాటలైనా, కవిత్వమైనా మనసు లోతైన ఆలోచన ఇస్తుంది. కాసేపు మనసులో చూసుకొని మనసునే మరోసారి అవునా, అవుననుకుంటా అని అనుకునే ఆలోచన కనబడుతుంది. ఈ సినీ గీతాన్ని వినండి, చదవండి.

**'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది**
**కన్నుల్లో నీరు తుడిచీ కమ్మటి కల ఇచ్చింది'**

ఒకే ఒక్క సినీ గేయం రచించారు ఈ మహానుభావుడు. ఎంత లోతుకి దిగి ఆలోచన చేసుకుంటాడో. ఏమనుకుంటాడో. పాట ఒకటి వచ్చింది అంటే చాలు. అర్థం చేయడానికి. కమ్మటి కలం ఇచ్చింది అనే భావన కళ్లముందు కనబడుతుంది కదా.

**రమ్యంగా కుటీరాన రంగవల్లులల్లిందీ**
**దీనురాలి గూటిలోన దీపంగా వెలిగిందీ**
**శూన్యమైన వేణువులో ఒక స్వరం కలిపి నిలిపిందీ**
**ఆకురాలు అడవికి ఒక ఆమని దయచేసిందీ**

ముగ్గులు వేస్తుంది ఈ భావన. దీపమై వెలుగుతుంది. ఏ వేణువైనా శూన్యంలోనే ఉంటుంది కదా? కనుక ఆ శూన్యంలో స్వరాలు కలుపుతున్నాయి. ఆకురాలు అడవికి ఒక ఆమని దయచేసింది. ఆ మాటలు మాట్లాడుకుంటాయి. ఆశలు ఆకులు, దిగులు రాలిపోయేవి. ఆమనిని తెప్పిస్తుంది. అది అడవి. అందులో ఏదో ఆశ. ఆకాశంలో నుంచి నదికి దిగి అక్కడ నదీతీరాన నిలబడి ఒక పడవ వస్తుందని, ఎవరైనా వస్తారా అనీ, వస్తే బాగు అనుకుంటా వచ్చి తీరుతుందనే నమ్మకం...

**విఫలమైన నా కోర్కెల వేలాడే గుమ్మంలో**
**ఆశల అడుగులు వినబడి అంతలో**
**పోయాయి**
**కొమ్మల్లో పక్షుల్లారా!**
**గగనంలో మబ్బుల్లారా!**
**నది దోచుకుపోతున్న నావను ఆపండీ!**
**రేవు బావురు మంటోందని నావకు**
**చెప్పండీ!**



ఈ నెల 30న
గుంటూరు శేషేంద్ర శర్మ వర్ధంతి

అక్కడే గుమ్మంలోనే కోర్కెలు వేళ్లాడుతున్నాయి. అవి విఫలమైనాయి. ఆశలు వస్తాయా రావా, వినబడతాయా లేదా. పక్షులారా అని పిలుస్తున్నాయి. మబ్బుల్ని రమ్మంటున్నారు. నది దోచుకుంటున్నది. నావను ఆపాలి. రేపు అక్కడే ఏడుస్తున్నది బావురుమని. ఇది మేఘ సందేశం కాదు. నదీ సందేశం. నావకు సందేశం. భావగీతికా సందేశం. ఇంకా వస్తారు అనే ఆశే బతికిస్తుంది, రచయితను, గేయానికి స్వర రచయితకు. కథానాయికకు బతికిస్తుంది. ఎంత గంభీరమైన, స్పష్టమైన, లోతైన, గాఢమైన కనబడని, వినబడని, ఈ భూమి నుంచి ఆకాశం దాకా వినబడేట్టు అరుస్తున్నట్టు స్పష్టంగా చెప్పగలిగిన కవి ఎవరు?



మాడభూషి శ్రీధర్

**తెలుగు సాహిత్యంలో వచ్చిన కవితా ప్రక్రియల గురించి ఆలోచించినపుడు ఇతర భాషల నుంచి వచ్చిన గజళ్ళు, రుబాయిలు, హైకులు మొదలైనవి మినహా నిలదొక్కుకున్నవి తక్కువ. అలాగే తెలుగులో వచ్చిన ప్రక్రియలు నానీలు, రెక్కలు తప్ప మరేవీ అంతగా నిలదొక్కుకోలేదు. దీనికి కారణం తెలుగు కవులు ప్రక్రియలో ఉన్న సారం, తాత్త్వికత, గాఢత అర్థం చేసుకోకుండా కేవలం రూపాన్ని మాత్రమే అనుసరించి కవితా ప్రక్రియను అపరిపక్వంగా సృజించడమే అనవచ్చు.**

# నానీల తీరాన కవిత్వపు అలలు

తెలుగులో వచ్చిన అనేక కవితా ప్రక్రియలు అలా వచ్చి ఇలా వెళ్లిపోయినవే. చాలా ప్రక్రియలు వచ్చినట్టే తెలియదు. తాత్త్విక భూమిక లేని ఏ రచనా కాలానికి నిలబడలేదు. ఏ కవీ ఇది కాలానికి నిలబడుతుందని కవిత్వం రాయడు కానీ, పఠిత మనసులో నిలవాలని మాత్రం రాస్తారు.




నానీల విషయంలో ఇప్పుడు రాస్తున్న కవులు అవగాహనతో, అధ్యయనంతో రాస్తున్నట్టు వస్తున్న పుస్తకాలను చూస్తే తెలుస్తున్నది. అటువంటి కవయిత్రి లహరి. ఈమె తన జీవితానుభవాలను పొందికగా, పొదుపుగా అక్షరాలలో పొదిగింది. నానీల నిర్మాణం అవగతం చేసుకొని రాయడం వల్ల అవి brevityతో పాటు భావార్థాన్ని కూడా ఇముడ్చుకున్నాయి.

**అన్నింటికీ చావొక్కటే/ మార్గమా..?**
**మరి లోకమంతా/ ఎప్పుడో ఖాళీ అవ్వాలే..!**

**గుడిసెలో/ కొలువైన సరస్వతి**
**లక్ష్మీ కటాక్షం లేక/ బడి మానేసింది.**

కవిత ముగిసిన వెంటనే పఠిత హృదిలో కవిత మొదలవడం ఉత్తమ సృజన. అటువంటిదే పైన చెప్పిన నానీ. మనసును కదిలించడం, హృదయాన్ని చివుక్కుమనిపించడం చేయకపోతే ఆ కవిత ఫలవంతం కానట్టే.

**మంచితనం/ బలహీనత కావద్దు**
**కాఠిన్యమూ/ రక్షణ కవచమే**

**మా పాత టీవీ/ నాన్న బహుమతి**
**తీయలేను/ పెట్టుకోలేను.**

ఒక దృశ్యాన్ని హృద్యంగా రూపుకట్టిన నానీ ఇది. ఇటువంటి భావసాదృశ్యాలు చాలా వచ్చినయి. వ్యక్తీకరణలో నవ్యత, వస్తువును తీసుకోవడంలో నిపుణత మాత్రమే ప్రక్రియను నిలబెడుతుంది. ఈ నానీలో క్లుప్తత, చిన్నచిన్న పదాల్లో కూర్చిన నాన్న మీద ప్రేమ వల్ల ఈ నానీ వెలిగింది. లహరి నానీల నాన్న ఎన్.గోపీ గారి పుత్రిక. వాక్యాన్ని ఒడుపుగా వాడటంలో సిద్ధహస్తుడైన గోపీ గారి వారసత్వాన్ని లహరి ఈ నానీల్లో చాలావరకు కొనసాగించింది. అన్ని నానీలు అదే కాంతితో మెరవడం ఎవరికీ సాధ్యం కాదు. కావలసినదల్లా...

**నానీల నాన్నను**
**చేరుకోవాలా?**
**అధ్యయనశీలత**
**ఒక్కటే దారి.**

ఈ స్పృహ మాత్రమే కవిని మంచి కవిత్వదరులకు చేరుస్తుంది. నానీల తీరాన నిలిచి కవిత్వపు అలలతో కాళ్లు తడుపుకొంటున్న లహరిని కవితాంబుధిలోకి అడుగులు వేయమని కోరుతున్నాను.



పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

## ఆహ్వానం

### 4వ వర్తన సమావేశం

ఈ నెల 28న మంగళవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 4వ వర్తన సమావేశం జరుగనున్నది. ఈ సమావేశంలో 'తెలంగాణ నవల తీరుతెన్నులు' అనే అంశంపై కాసుల ప్రతాపరెడ్డి ప్రసంగించనుండగా, ఈ సమావేశానికి గుడిపాటి అధ్యక్షత వహించనున్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులకు ఆహ్వానం.

– ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్,
వర్తన కార్యదర్శి

### ఆవిష్కరణ సభ

2024, జూన్ 1 సాయంత్రం 5.30కు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో ఇనుగుర్తి లక్ష్మణాచారి రాసిన 'గజల్ పారడైజ్' వ్యాస సంపుటిని ప్రముఖ కవి, రచయిత డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించనున్నారు. కృతి స్వీకర్త డాక్టర్ బి.బాలకృష్ణ కాగా, సభాధ్యక్షత అనంతోజు మోహన్‌కృష్ణ వహించనున్నారు. ముఖ్య అతిథి కె.ఆనందాచారి, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ పోతగాని సత్యనారాయణ, తెల్లాకుల కోటేశ్వరరావు, డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర, కనపర్తి శ్రీదేవి హాజరుకానున్నారు. గ్రంథ పరిచయం, సమీక్ష సయ్యద్ ముజాహిద్ అలీ చేయనుండగా తొలి ప్రతి ఇనుగుర్తి భాగ్యలక్ష్మి స్వీకరించనున్నారు.

– తెలంగాణ సాహితి

## బతుకు పెట్టె



అయిదవ తరగతిల
హాస్టల్‌కు పోతుంటే
నాన్న కొనిచ్చిన ట్రంకు పెట్టె
అరచెయ్యంత మందం
ఏ చేతి నైపుణ్యమో గానీ
నలభై ఏండ్లయినా గింత
సొట్టలు పోలే, చిల్లులు పడలే
పుస్తకాలు, బట్టలు, దుప్పట్లు, కొబ్బరి
నూనె సీస, సబ్బుల బిల్ల, మాడ్చిన కారం,
గురిగి, లాకర్‌లా దాని పెట్టుకునేది
కంపాక్స్ బాక్స్, దువ్వెన అద్దం,
వ్యాజిలైను, అన్నీ కోడిపెట్టలా కప్పుకునేది
ఎప్పుడూ ఏదడిగినా
అమ్మలా అడిగినట్టే ఇచ్చేది
భూమి పర్వతాన్ని మోసినట్టు
నా బరువంతా మోసింది
పదవ తరగతి వరకు
నాకు ఒక అపురూపమే

అలిసి పోయినప్పుడు కుర్చయ్యేది
స్నేహితులకు కూడ చోటిచ్చేది
తలకింద దిండయ్యేది
రాసుకోవడానికీ ప్యాడయ్యేది
పాటకు దరువులయ్యేది

కిరాయిల్లు మారినప్పుడల్లా
పడేద్దమంటరు కానీ
నా బాల్యాన్ని మోసిన అమ్మలాంటి అమ్మ
ఇన్నేండ్లయినా ముడతలు పడలే
ఇస్త్రీ చేసిన ప్యాంటులా కడక్ ఉంటది
పదేండ్లు నన్ను కడుపుల
పెట్టుకొని అమ్మై మోసింది
ఇల్లు మారినప్పుడల్లా భుజాల మీద
పెట్టుకొని తిరుగుతుంటే హాస్టళ్ల రూమ్
రూమ్ తిరిగిన జ్ఞాపకాలే...
పెట్టెను తెరిచినప్పుడల్లా
బొడ్డుమల్లెలు విచ్చుకున్నట్టే

ఒకనాడు లాగుజేబుల తాళం
చెవెట్లనో జారిపోయింది
చిలుకును ఇరుగ్గొడుదామన్నరు
పానమెందుకో ఒప్పుకోలే
బడి నుంచి హాస్టల్‌కు నాలుగు మైళ్లు
నాలుగు సార్లు తిరిగి దేవులాడినా దొరకలే
నెత్తిన పెట్టుకొని సంతల
పూసల పుల్లయ్య తానికోయిన
ఒక్క దెబ్బకొట్టకుండ చిటుక్కున తెరిచిండు
ఎంత పనితనమో.. ఒక మిరాకిలే

బస్టాండ్ల బస్సుల్లో అప్పుడప్పుడు
హాస్టల్ పిల్లలు రేకు పెట్టెలతో ఎక్కి
దిగుతుంటరు అమ్మనాన్నలతో
వాళ్లను చూసినప్పుడల్లా నా
జ్ఞాపకాలను తోడుకుంటాను
నా భుజాల మీద పెట్టెనే అనుకొని
బాల్య అనుభూతులతో
పరవశించిపోతాను

ఇంట్లకు బీరువొచ్చినాక
ఎన్నడు తెరిచి చూడలే
కాళ్లకు అడ్డం తగిలినప్పుడల్లా
మనసున దండం పెట్టుకునేది
పారెయ్యాలంటే పానమొప్పుకోదు
తెచ్చినప్పుడే గానీ
మల్లెప్పుడు రంగెయ్యలే
పచ్చని వార్నీసుతో మెరుస్తూనే ఉంటది
నలుగురు కూసున్నా ఇంత కూడ
పాడుగాలే

పిల్లలు పెట్టెనెక్కి తొక్కుతుంటరు
చూసినప్పుడల్లా మనసు చలించి
కలుక్కుమంటది
దాంట్ల బంగారముందా తొక్కొద్దు
తొక్కొద్దంటవు అని నన్నే గసిరిచ్చి
ఎదిరిచ్చే పిల్లలు
అమ్మా! అందులో ఏమిలేవు గానీ
నన్ను వెలిగించిన అక్షరాలున్నాయి
మెదడును సానపెట్టిన ఆకురాళ్లున్నవి
సెల్ఫ్ గవర్నమెంట్‌కు దిగిన
గ్రూప్ ఫోటో ఉంది
బాల్యంలో రాసిన కవితల తడులున్నవి
స్నేహితుల ఉత్తరాల గుండె
స్పందనలున్నయి

బొట్టు పెట్టె, ట్రంకు పెట్టె,
సారె పెట్టె, పీర్ల పెట్టె, దేవుని పెట్టె
సొమ్ముల పెట్టె, బోషాణాల కన్నా
నన్ను నడిపిచ్చిన బతుకు పెట్టె నా
గుండె పెట్టె



వనపట్ల సుబ్బయ్య
94927 65358